క్లుప్తంగా

బ్యానర్లను తొలగించండి

పెనగలూరు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఎలాంటి బ్యానర్లు కనిపించకూడదని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు కావడంతో రాజకీయ నాయకుల బ్యానర్లు ఎక్కడా కనిపించకూడదన్నారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలుంటే ఆ విగ్రహాలకు గుడ్డ కట్టి ముఖం కనిపించకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుపేట గ్రామ శివారులో వెలసిన గంగాభవాని అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి కాయాకర్పూరాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైతులను అన్ని విధాల ఆదుకుంటాం

పుల్లంపేట : రైతులను అన్ని విధాల ఆదుకుంటామని పుల్లంపేట వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పుల్లంపేటలోని రైతు భరోసా కేంద్రంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు, రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పథకాలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు అగ్రికల్చర్ ఏడీ కవిత, ఏఓ కృష్ణచైతన్య, వెటర్నరీ వైద్యులు సుదీష్ తదితరులు పాల్గొన్నారు.

1నే జీతాలు చెల్లించేలా చూడండి

రాయచోటి అర్బన్ : ప్రతినెలా 1వతేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా ప్రభుత్వం వెంటనే చట్టం తీసుకురావాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడు ఓర్సు సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతినెలా 1వ తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి జీతాలు చెల్లించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీజీఈఏ రాయచోటి కార్యదర్శి సుజిత్, ఉపాధ్యక్షులు మల్లికార్జున, శ్రీనివాసులు నాయక్, రమణ, సంయుక్త కార్యదర్శి వలీ, శివ, రాజశేఖర్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వవిప్

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సిపి నాయకులు యు ప్రభాకర్ రెడ్డి కుమారుడు వెంకట సుబ్బారెడ్డి, పూజిత నూతన వధూవరులను శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, నాయకులు టంగుటూరి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

మదనపల్లె : అదనపు కట్నం కోసం వేధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన హేమలత గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అనంతరం టూ టౌన్ పోలీసులు బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి భర్త నవీన్, అత్తమామలు నాగేంద్రబాబు, సుగుణమ్మ, కుటుంబసభ్యులు భార్గవి, జ్యోతి, రవి, రాజాలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామన్నారు. బాధితురాలు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు తెలిపారు.

నేటి నుంచి చెంబకూరు దర్గాలో ఉరుసు

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరు మూడు రోడ్ల కూడలిలో వెలసిన హజ్రత్ సుల్తాన్ చమన్‌దార్ అలీషా హుస్సేని ఖాదరి సర్వరీ దర్గాలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఉరుసు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు జరగనున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి ప్రముఖ ఖవ్వాలి గాయకుడు అంజద్‌చిష్తి, ముంబాయికి చెందిన మెయిన్‌నాజ్ ఆధ్వర్యంలో ఖవ్వాలీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సమసమాజ స్థాపనే జగనన్న ఆశయం

గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సమసమాజ స్థాపనే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిగుంట-1 గ్రామ సచివాలయం పరిధిలో శెట్టిగుంట, ఎస్టీకాలనిలలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. అంబటి మురళీ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలు బాణాసంచా పేల్చి గజమాలతో కొరముట్లకు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ప్రతి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలుతీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన జీవితం అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనులు నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, ఎంపీటీసి షఫీ, వెంకటరెడ్డి, రెడ్డయ్యరెడ్డి, ఎంపీడీఓ నాగార్జున, దేశయ్య, బాలక్రిష్ణ, మల్లి, సీహెచ్.రమేష్, సిద్దు, ఇర్ఫాన్, వినోద్ ఖన్నా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి నడుం బిగించండి

రాజంపేట : కుష్టు రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీహెచ్ కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం రాజంపేట పీపీ యూనిట్ కార్యాలయంలో కుష్టు నివారణాధికారి డా.ఎం.సౌజన్య ఆధ్వర్యంలో స్పర్శ లెప్రసీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కృషిచేస్తున్నాయన్నారు. మందులు పూర్తిగా ఉచితమన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుంచి 5సంవత్సరాలు పడుతుందన్నారు. వ్యాధి తీవ్రత ఉండి చేతుల పనిచేయకపోతే రూ.3వేలు, తీవ్రంగా ఉండి పూర్తిగా పనిచేయని వారికి రూ.12వేలు సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు మధుసూదనాచారి, పీపీ యూనిట్ వైద్యులు వికాస్, లక్ష్మీప్రసన్న, యూపీహెచ్‌సీ వైద్యురాలు డా.రెహనా, ఎంపీహెచ్‌ఓ అండ్ సీహెచ్‌ఓ గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, ఫిజియోథెరిఫిస్టు గుర్రప్ప, డీపీఎంఓ సురేష్, శంభుప్రసాద్, శ్రీనివాసరాజు, సిద్దిరామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశలు, కుష్టు నివారణ విభాగం సిబ్బంది ర్యాలీని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీహెచ్ కృష్ణ ప్రారంభించారు.


బెడ్‌షీట్లను అందజేస్తున్న సీహెచ్ కృష్ణ

బెడ్‌షీట్‌ల పంపిణీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్పర్శ లెప్రసీ అవగాహన సదస్సుకు హాజరైన కుష్టు రోగులకు కావుటూరు ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కావుటూరి సుబ్రమణ్యం నాయుడు ఆర్థిక సహకారంతో రోగులకు బెడ్‌షీట్లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీహెచ్‌కృష్ణ, వైద్యులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే రోగులకు భోజన ప్యాకెట్లను అందజేశారు.

భూ సేకరణ పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్

ఓబులవారిపల్లె : మంగంపేట కాలుష్య గ్రామాల తరలింపునకు ఏపీఎండీసీకి కావాల్సిన భూసేకరణ పనులను శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. ముక్కవారిపల్లె రెవెన్యూ పరిధిలోని భూములను వారు పరిశీలించారు. ఏపీఎండీసికి గ్రామాల తొలగింపు కోసం ఇప్పటికే 98 ఎకరాలు భూసేకరణ చేసినట్లు, ఇంకా 38 ఎకరాలు కావాలని ప్రతిపాదించడంతో భూములను పరిశీలించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం మంగంపేట ఏపీఎండీసీ గనులను సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్ వ్యూ పాయింట్ నుంచి సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీర్ మున్నీ, ఆర్ఐ రామ్మోహన్‌నాయుడు, వీఆర్ఓ శివ తదితరులు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయి పరిశీలనలో సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్

సంక్షేమ పాలనలో ప్రతి ఇంటా సంతోషం

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


సంబేపల్లె: సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గున్నికుంట్ల గ్రామంలోని జాందిగారిపల్లె, చవటపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, దండువారిపల్లె, రాజువారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలతోపాటు సమాజంలో అభివృద్ధిని చేసి చూపారని ఆయన అన్నారు. దేశంలోనే 98 శాతం హామీలను నేరవేర్చి, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా జగనన్న పాలన సాగిస్తున్నాడని కొనియాడారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో అర్హులకు ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కవిత, శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం

పేదల సొందింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నాడని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గ్రామంలోని జాదీగారిపల్లె, చవటపల్లెలకు సంబంధించి నిర్మాణాలలో ఉన్న జగనన్న కాలనీ పనులను పరిశీలించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో జగన్ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

చిన్నమండెం : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు నేరుగా అందాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. అభివృద్ధి, నిర్మాణ పనులలో వేగం పెంచాలని, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు సూచించారు. అదే విధంగా హౌసింగ్ బిల్లులను వేగవంతంగా చెల్లించాలని సూచించారు. అసైన్‌మెంట్ కమిటీలో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

పరామర్శ

మండలంలోని చిన్నర్సుపల్లె గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు, సర్పంచ్ పుల్లమ్మ కుమారుడు దేవరింటి గిరిబాబుయాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం చిన్నర్సుపల్లెలోని ఆయన ఇంటికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి అతని మృతిపట్ల సంతాపం తెలిపారు. అతని చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే వెంట దామోదర్, డీలర్ నరసింహులు, ప్రసాద్, అంజి, శ్రీను, దనాంజి, ఎంపీటీసీలు ఏజాస్‌అలీఖాన్, రమేష్, వెంకటప్పనాయుడు, శ్యామ్, సర్పంచులు నజీర్‌బాషా, అఫ్రోజ్, లక్ష్మీరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నందలూరు(రాజంపేట) : మామిడి తోటల సాగులో రైతులు పూత, పిందె దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలమని రాజంపేట ఉద్యానవన శాఖాధికారి జి.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆడపూరు, ఎర్రచెరువుపల్లె రైతు భరోసా కేంద్రాల పరిధిలో విస్తరించి ఉన్న మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటలలో పూమొగ్గ, పచ్చిపూత దశలో ఉన్న తోటలలో తేనే మంచు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా డైమీతోయేట్ 2మి.లీ బుప్రోఫ్యూజిన్ 1-2 మి.లీ లేదా తయోమిత్సగం 0.3 గ్రాముల లీటరకు నీటికి కలిపి కాండము, కొమ్మలు, ఆకులు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సకోనజోనల్ 1.5 మి.లీ లేదా డైనోకాప్ 1మి.లీ లీటరు లేదా ట్రిడిమార్స్ 1గ్రాముకు లీటరు నీటికి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో మందులు మార్చుతూ పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే తామర పురుగులు నివారణకు ఫిప్రోనిల్ 2.మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు కలిపి నల్లపూత దశలో పిచికారీ చేయాలన్నారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వీఏఏలు శ్రీహరి, కావ్య, రైతులు పాల్గొన్నారు.


మామిడిపూతను చూపిస్తున్న అధికారి

జగనన్నతోనే యువతకు ఉపాధి అవకాశాలు

రాయచోటి అర్బన్ : జగనన్నతోనే రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్‌లు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరు మార్గంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కార్యాలయంలో వారు ఎన్నికల ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు అన్నా సలీం, శ్యామ్‌కుమార్, జబీవుల్లా, ఇంతియాజ్, అజంతుల్లా, దివాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, గూటం రాము తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ మద్దతుతో బరిలో నిలుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓట్లు వేయాలని మున్సిపల్ పరిధిలోని మాసాపేట వార్డు కౌన్సిలర్ పద్మావతి శుక్రవారం పార్టీ నేతలతో కలసి ప్రచారం చేశారు. ఓటర్ల జాబితా తీసుకుని తమ పరిధిలోని పట్టభద్రుల ఇళ్ళ వద్దకు వెళ్ళి రవీంద్రారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆమె వెంట శ్యామ్‌కుమార్, అమీర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మేడా, ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ప్రస్తుత తరుణంలో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్‌ను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరిది ఉరుకులు, పరుగులమయమైన జీవితమైందన్నారు. అందువల్ల అనేక మంది చిన్న వయస్సులోనే కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల బారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో పేరుగాంచిన కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్‌ను రాజంపేటలో కూడా అత్యాధునిక వైద్య పరికరాలు, యాబై పడకలతో ఏర్పాటు చేయడం ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, డాక్టర్ విన్యా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

నందలూరు(రాజంపేట) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భోజన విరామ సమయంలో నందలూరు, నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో పర్యటించి విద్య, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగైన, రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు జీతాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. పూర్తిస్థాయి పదోన్నతులతోపాటు పాఠశాలలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రమణ్యం రాజు, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణరెడ్డి, వెంకటరమణయ్య, సనావుల్లా, రవిశంకర్‌రెడ్డి, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్, రౌఫ్‌బాషా, అల్లం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో భేటి అనంతరం సాయిశ్రీనివాస్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట టౌన్ : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్ల తొలగింపు, మరమ్మతు పనులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈఈ సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్ళపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లె, సరస్వతీపురం, బావికాడిపల్లె, రెడ్డిపల్లె, కొండూరు, పెనగలూరు, టీజీపల్లె, బెస్తపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెనగలూరులో...

పెనగలూరు : మండలంలో శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. పెనగలూరు, కొండూరు, బెస్తపల్లి, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నాటుసారా స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఒక మహిళను అరెస్టు చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తండాకు చెందిన బి.సరోజమ్మ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడులో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని నింధితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

రాయచోటి అర్బన్ : తెలుగింటి ఆడపడుచు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని బోస్‌నగర్‌లో ఉన్న ప్రధాన పోస్టాఫీసు కార్యాలయం ఎదుట బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ సీపీఐ శ్రేణులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదంటూ విమర్శించారు. విశాఖ జోన్ ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, విశ్వనాథనాయక్, సుమిత్ర, సుధీర్‌కుమార్, జక్కల వెంకటేష్, సునీత, పద్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

'కేసులు పరిష్కరించుకోండి'

సిద్దవటం : శనివారం జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు, ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి శ్రీనివాసకళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవచ్చునన్నారు. కోర్టు పరిధిలోని అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

దుష్ప్రచారాలను తిప్పకొట్టేలా సంసిద్ధమవ్వాలి

- ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశాం
- గృహ సారథుల శిక్షణా సమావేశంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు


వీరబల్లి: సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



వీరబల్లి: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

వీరబల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన గృహసారథులు, వలంటీర్లు ప్రభుత్వానికి, పార్టీకి కీలకమని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి అన్నారు. వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వీరబల్లిలో ఏర్పాటు చేసిన గృహ సారథుల శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం వందల పేజీలు మేనిఫెస్టోలు రూపొందించి రెండు పేజీలు కూడా అమలు చేయలేదని, అదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుదీర్ఘపాదయాత్రలో చెప్పిన పథకాలు 95శాతం అమలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పకొట్టేలా గృహ సారథులు సంసిద్ధమవ్వాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదని, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఎండ కడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ధోరణిలో టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టేందుకు గృహసారథులు నడుం బిగించాలని తెలియజేశారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే ఆంధ్రరాష్ట్రం గర్వించదగ్గ పనిచేసిందని ఇతర దేశాలలోనూ చెప్పుకుంటున్నారన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం గృహసారథుల కిట్లను కొత్తగా నియమితులైన మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్ నరేష్ స్వామికి అందజేశారు. సమావేశానికి హాజరైన వారందరికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి రాజంపేట ఎమ్మెల్యే మేడా చేతులు మీదుగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ శివరాం, రాజంపేట నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వీరనాగిరెడ్డి, వీఆర్ విద్యాసంస్థల అధినేత వీఆర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్రేతేశ్వరుడి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

రాజంపేట టౌన్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రమైన హత్యరాలలో త్రేతేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేడా తెలిపారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రధానంగా మడుగు వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తంబెల వేణుగోపాల్‌రెడ్డి, మందరం గంగిరెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి, శేఖర్‌రెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

వీరబల్లి : పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీలోని కొన్ని గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పనితీరుపై ఆరా తీశారు. పథకాలు బాగా అందుతున్నాయని వలంటీర్లు తమకు 1వ తేదీన పింఛన్ అందజేస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వం మాకు ఎప్పుడూ ఉండాలని ఆయనతో పలువురు వృద్ధులు పేర్కొన్నారు. గ్రామాలలో తాగునీరు, సీసీరోడ్లు, తదితర మౌలిక వసతులు సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలిపితే వెంటనే పరిష్కరిస్తారన్నారు. కులం, మతం, భేదం, వర్గం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన సీఎం సలహాదారుడు


రికార్డులు పరిశీలిస్తున్న ధనుంజయ్‌రెడ్డి

రైల్వేకోడూరు : మండలంలోని తంబిళ్ళవారిపల్లెలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి సలహాదారుడు రక్కాసి ధనుంజయ్ రెడ్డి సందర్శించారు. ఆసుపత్రిలోని వైద్యులను పేదలకు అందిస్తున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నూతన పీహెచ్‌సీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.

వివాహానికి ఆర్థిక సాయం

రాయచోటి టౌన్ : పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి రాయచోటి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు షరీఫ్ ఆర్థిక సాయం అందించారు. యువతికి వివాహం నిశ్చయం అయ్యిందని తెలిసిన వెంటనే ఆయన తన వంతుగా బియ్యం, సరుకులు, ఇతర వస్తువులు అందించారు. ఆయన్ను యువతి కుటుంబ సభ్యులు అభినందించారు.